నీతిపాఠము

ఈ కాలంలో కుర్రాళ్లకి పాఠశాలల్లో నీతిబోధ చెయ్యకపోవడం చాలా పొరపాటని చాలాకాలంబట్టి నావుద్దేశ్యం. చదువయిపోయినతర్వాత కుర్రవాణ్ణి ప్రపంచకంలో వదలిపెట్టినప్పుడు వాడికి ఎక్కువ సహాయకారిగా వుండి సంసారసాగరాన్ని యీదడానికిగాని దేశపురోభివృద్ధికి తోడ్పడడానికి గాని అర్హత కలిగించేది నీతిబోధ అవుతుంది గాని—ఈ గణితశాస్త్రాలు, దేశచరిత్రలు, భూగోళ ఖగోళ చరిత్రాదులు కానేరవు. దైవభక్తి, పితృభక్తి దేశభక్తి యిత్యాది భక్తులు కుర్రతనంలోనే నూరిపొయ్యకపోయినట్లయితే పిల్లవాడు ప్రపంచకంలో ప్రవేశించడంతోనే వ్యసనాలకి లోబడిపోతాడు. నీతిబోధ లేకపోవడం వల్లనే యీకాలపు కుర్రవాళ్లు తల్లిదండ్రులకు లొంగక యిష్టంవచ్చినట్లు సంచరిస్తూ దేహాన్నీ బుద్ధినీ పాడుజేసుకుంటున్నారు. తల్లిదండ్రులు చెప్పినట్లే ప్రపంచకంలో కుర్రవాళ్లందఱూ నడచుకొన్నట్లయితే ఈ ప్రపంచకం యిప్పుడున్న విధంగావుండక సీదాగా క్రొత్తప్రపంచమై వుండేది. ఈ కొత్త ప్రపంచంలో జైళ్ల అవసరం లేదు. సంఘసంస్కర్తల అవసరం లేదు. మతబోధకు లుండక్కరలేదు. కోర్టులు అసలే అక్కరలేదు. కాని యీకాలం కలికాలంగదా! అంచేతనే పితృవాక్యపరిపాలకులు చాలా అరుదుగా వున్నారు. అయినప్పటికీ నీతిబోధ తల్లిదండ్రులు చెయ్యకపోవడం చాలా

తప్పు. పోనీ వాళ్లు చెయ్యకపోతే పోయిరి, బడులలోనైనా చెయ్యక్కరలేదూ? ఈలోపం తీర్చడానికనే కొందరు ప్రముఖులు, దేశభక్తిచే పురిగొల్పబడి, విద్యార్థులకోసమని కొత్త కొత్త పత్రికలు పెట్టి, ఉపన్యాసాలిచ్చి పాటుపడుతున్నారు. వీరివంటివారే మరికొందరు పనిపాటలు లేక వుద్యోగాలు దొరక్క ఏమి చెయ్యడానికీ తోచక—పోనీ విద్యార్థుల కీ నీతిబోధేనా చెయ్యవచ్చును. దానివల్ల పుణ్యం పురుషార్థం కూడా—అనుకొని, కొత్తకొత్త విద్యార్థి పత్రికలు లేవనెత్తి దేశసేవ చేస్తున్నారు. దేశసేవతోబాటు వీరు భాషాసేవ కూడా చేస్తూన్నట్లు అనుకొంటున్నారు. 'ఏకా క్రియా ద్వ్యర్థకరీ బభూవ' అన్నట్లు వీరిని ప్రజలు మెచ్చుకుం టున్నారు గాని కుర్రాళ్లు వీరిపత్రికలు చదవకపోవడం చాలా నీచమైన పని. వీరికోసమని ధనప్రయాసలకు వెనుదియ్యక పత్రికలు పెట్టితే వాటిని వీరు చదవకపోవడంకన్న తప్పుపని మరి ఏ మున్నది? చదవక ఈ కుర్రవాళ్లు యధాప్రకారం కాఫీహోటల్కుకి వెడుతున్నారు. గ్రామ్యాన్నే గ్రంథాలు వ్రాస్తున్నారు. క్రాపింగు లుంచుకుంటున్నారు. భావగీతాలు వ్రాస్తున్నారు. నవలలు చదువుతున్నారు. నాటకాల్లో వేషాలు వేస్తున్నారు. పెద్దపిన్న తారతమ్యం తెలియకుండా ప్రవర్తిస్తున్నారు. ఈ పత్రికలు చదవకపోవడానికికూడా కారణం యుక్తవయస్సులో నీతిబోధ చెయ్యకపోవడమే కాని మరి వకటి కాదు. ఈ సంగతి గుర్తెరిగి మా కుర్రవాళ్లకి ఏడాది వెళ్లినప్పటినుంచీ నీతి బోధచెయ్యడానికి పూనుకొని ఆవిధంగా చేస్తున్నాను. నేను చేస్తూన్న యీ వుత్తమకార్యమును

మెచ్చుకొని వాళ్ళూ కృతజ్ఞత చూపడం లేదు. లోకమూ చూపడం లేదు. నిజంగా దేశాభివృద్ధికి తోడ్పడేవారికి యీ కాలంలో మెప్పు లేదు.

ఒకనాడు మాచంటబ్బాయి—రెండేళ్ళవాడు — కొంచెము అల్లరిచెయ్యడం మొదలుపెట్టేడు. ఆసమయంలో నేను కొంత వాఙ్మయపరిశోధన చేసుకుంటూ తదేకదీక్షతో వున్నాను. ఆపరిశోధన ఏమిటీ అంటే పూర్వము మనదేశము నేలిన 'మల్కిభరాముడు' ఎవరూ అని. కొందరితడు నబాబంటారు గాని అది విశ్వసనీయము కాదు. క్షత్రియుడే అయితే సూర్యవంశపువాడా, చంద్రవంశపువాడా? ఒకవేళ బ్రాహ్మణుడైతే నియ్యోగా వైదీకా? అని. ఇంతవరకూ కవి చరిత్రకారులు ఆంధ్రకవులను సాధ్యమయినంత మట్టుకు నియ్యోగులనుగా పరిగణించినారు. ఆకవులను పోషించిన రాజుల విషయమై వారు ఆట్టే వ్రాయలేదు. నేను ఆపనికి పూనుకొని ఆయేలికలుకూడా నియ్యోగులే అనడానికి ప్రబలమైన కారణాలు సంపాదిస్తున్నాను. 'మల్కిభరాముడు' నామతంలో నియ్యోగి కావచ్చు నేమో అని తోస్తుంది. ఈపరిశోధన కార్యానికి నేను రెండుపద్యములు సంపాదించినాను.

క. ఆకుండ గల్పవృక్షము
ఈకుండన్ లోభివగుదు విహపరములకున్
మీకుండగ మాకిచ్చుట
మాకుండగ నడుగబోము మల్కిభరామా!

ఉ. ఓరి విధాత యోరి వినరా కనరా తలకొట్లమారి ని
స్సారపులోభిరాజులను జంపక మల్కిభరామచంద్రునిన్
సారయశోనిధిన్ ఘనుని జంపితి వందున నేమి? దక్కె
చేరువనింతరాజును సృజింపగ నీతరమే వసుంధరన్!

ఈ పద్యములను ఆధారముగా చేసుకొని నా వాదం నిలవబెట్టుకోడానికి ప్రయత్నం చేస్తూంటే మా రెండేండ్ల పిల్లవాడు శ్రీనాథుని కాశీఖండం తీసుకొని, దానిలో పేజీలన్నీ ఒకదాని వెనుక నొకటి చింపి వెయ్యడం మొదలుపెట్టినాడు. కొంతపుస్తకం కాళీ అయిన తర్వాత ఆసంగతి నేను గ్రహించి సమయం వచ్చినప్పుడు ఊరికే పోనియ్యకూడదనుకొని వాడికి నీతిబోధ చెయ్య తలుచుకొన్నాను. నాకెదురుగా వాడిని మఠంవేయించి కూచోబెట్టి చేతులు కట్టించి ఈరీతిగా వుపన్యాసం ప్రారంభించేను. "నీవింకా కుర్రవాడవు. వస్తువు యొక్క సరియైన విలవ నీకు తెలియడంలేదు. శ్రీనాథుడు మహాకవి. ఆమహాకవి వ్రాసిన గ్రంథమును చింపడము చాలాతప్పు. అదిగాక పుస్తకం సరస్వతీదేవి రూపము. ఈపని నీవు చేయడంవల్ల మహాకవియెడలా సరస్వతియెడలా అపరాధం చేసిన వాడవయినావు. కాబట్టి యింక ముందెప్పుడూ పుస్తకాలు చింపబోకు. అదిగాక నీకు సంసారకష్టాలు యింకా ఏమీ బోధపడలేదు. రూపాయిన్నరయిచ్చి కొన్న పుస్తకాన్ని నీవు తృణప్రాయంగా చూచి చింపివేయడంవల్ల ధనవిషయమున నీకు సరియైన అభిప్రాయంలేనట్లు స్పష్టము. 'ధనమూలమిదం జగత్'ను ఆర్యోక్తి నీవు మరచిపోకు. ఎంత కష్టపడితే వస్తుంది రూపాయిన్నర! చెమట ఊడ్చి ఈడబ్బు

సంపాదించిన నాపైకూడా నీకు గౌరవంలేనట్లు నాకు తోస్తూంది. 'పితృదేవోభవ' అనేమాట ఎప్పుడూ మరచి పోకు. వెళ్లు'' అని మావాడిని పంపించివేసినాను. మావాడు వంటింట్లోకి వెళ్లి అక్కడ మజ్జిగతప్పేలా కిందకు పడదోసి నాడు. ఇంతబోధాచేస్తే యిలాగ చేస్తాడా అని వాడిని రెండుతన్ని ఎన్నటికైనా ఈనానీతిబోధ ఫలించకపోతుందా అని వూరుకొన్నాను.

అడపా తడపా మాచంటి కుర్రవానికి నీతిబోధన చేస్తూ వుంటాను గాని మా పెద్దకుర్రవాడి విషయంలోమాత్రం ఎక్కువ జాగ్రత్తతీసుకొని ప్రతీదినం ఏదో వొకవిధంగా సమయంచూచి సూక్తిరత్నములు నాలుగయిదు యిస్తూ వుంటాను. సాధారణంగా సాయంకాలం భోజనాలుచేసిన పిమ్మట ఆరుబయట మావాడిని కూచోబెట్టి నీతిబోధచెయ్యడం నా అలవాటు. వాడు అప్పుడే కునికిపాట్లుపడడం వాడి అలవాటు. నీతిబోధ చెయ్యడానికిగాని, ఒకపాఠము మొదలుపెట్టడానికి గాని కొంత తంతువుంది. బోధను ఒక్కమారు కూచునీ కూచోవడంతోనే హరిఃఓం అని మొదలుపెట్టకూడదు. ముందుముందుగా కుర్రవాడి మనస్సు కొంత దోహదంచేసి పిమ్మట నీతిబీజాలు నాటవలెను. భూమికి దున్నడం ఎటువంటిదో బోధకు ఈదోహదము అటువంటిది. ఈనాటి విద్యాబోధకు యిది కీలకము—మూలసూత్రము. ఆ సంగతి గ్రహించినవాడ నగుటచేత నేను ఒకనాడు మా వాడిని కూచోబెట్టి నీతిబోధకు దోహదం ప్రారంభించేను. అసలు మావాడికి చెప్పదలచుకొన్న నీతిపాఠము మాతృ

భక్తిని గురించి. మావాడు తరుచు తనతల్లితో భోజనం చేసేటప్పుడూ, బళ్లోకి వెళ్లమన్నప్పుడూ, ఏదేనాపని చెప్పి నప్పుడూ యతిఅంటే ప్రతంటూ వాదం చేస్తూవుంటాడు. ఆ దురభ్యాసం మానిపించాలనే వుద్దేశంతో యీ పాఠం మొదలు పెట్టేను. ఏమంటారా—ఫలానా శీతారామయ్యగారి అబ్బాయి నీతిమంతుడూ బుద్ధిమంతుడూ అనిపించుకుంటే తండ్రిగారికి ఘనతగాని వట్టిఅల్లరి పిల్లవాడనిపించుకుంటే తండ్రికేమి ఘనత? బాల్యంలో పిల్లవాడు చేసినతప్పులన్నీ తండ్రివేగా!

"అబ్బాయీ, మనవూళ్లో పెళ్లిళ్లు అవుతున్నాయి చూస్తు న్నావురా?"

"ఆ, నేచూస్తున్నా, నాన్నా;—ఎంచక్క వాళ్లంతా—"

"ఏమిటి చెప్పు"

"నాన్నా, వాళ్లంతా పల్లకీ ఎక్కి ఊరేగుతూంటే చూశాను"

"ఇంకేమేమి చూశావుచెప్పు"

"నాన్నా, పల్లకీలో ఎక్కితే ఏలాగవుంటుంది?"

"బాగానేవుంటుందిగాని, ఇంకా ఏమేమిచూశావోచెప్పు"

"నాన్నా—మరి—పల్లకీలో ఎక్కాలంటే—మరి—పల్ల కీలో ఎక్కడం ఏలాగ?"

"పల్లకీలోనా—పెళ్లిచేసుకుంటే సరి. కాని నీవింకా ఏమేమి చూశావు చెప్పు"

"నాన్నా, మరినేను పల్లకీలో ఎక్కాలని వుంది. నాకు పెళ్లిచెయ్యవు?"

"ఆఁ, ఆఁ, ఏమిటే అంటున్నావు"

"నాన్నా, నాకు పెళ్లిచేస్తే నేను అయిదురోజులూ పల్లకీలో కూచుంటా కాదూ"

"తప్పు; తప్పు; విను. పెళ్లంటే నీవు పల్లకీలోకూచోవడం అనుకుంటున్నావు. పెళ్లి జీవితంలో ఒక పరమపవిత్రకార్యము. దానిని చుల్కనగా చూడకూడదు. నీకింకా ఆరేండ్లు నిండ లేదు. అప్పుడే పెళ్లా?"

"ఏం నాన్నా!"

"నాకెప్పుడైందో పెళ్ళి ఎరుగుదువా? నాకు జీవితయాత్ర జరిపించడానికి శక్తిసామర్థ్యాలు కలిగినపిమ్మటనే పెళ్లయింది."

"నీపెళ్లికి నన్ను పల్లకీలో కూచోబెట్టుకున్నావా, నాన్నా!"

"ఏమిటే?"

"అప్పుడు నేను చిన్నపిల్లవాణ్ణికాదు నాన్నా!"

"కుర్రవాళ్లు అట్టే పెండ్లిసంగతి మాట్లాడగూడదు. చూడు ఆకాసం కేసి చూడు. దానిమీద ఏముందో చెప్పు"

"నాన్నా, దాన్నిఆకాశం అంటావేం, అదికొండగాదూ?"

"రెండూ వొకటే. ఆకాశంమీద ఏముందో చెప్పు"

"మరీ నాన్నా, నాన్నా! మొన్న నన్ను అన్నవరపు కొండ మీదికి తీసికెళ్లావుకాదు"

"అవును"

"మరి నాన్నా, అక్కడికొండ చేతికందింది గాదే?"

"కొండంటే పర్వతమన్నమాట."

"మరి నాన్నా, ఆకొండమీద మరి చందమామా వాళ్లూ వుండరూ"

"పర్వతంమీద వుండరు. ఆకాశంమీద వుంటారు. చూడు. ఈమాటుచూసి చెప్పు ఏముందో ఆకాశంమీద"

"చందమామవుంది. చుక్కలున్నాయి. మేఘాలున్నాయి"

"ఆఁ. మేఘాలసంగతికేంలే, మరి చందమామ ఎప్పుడగుపిస్తాడు మనికి?"

"బయటికివచ్చి చూస్తేను"

"అదిగాదురా, పగలా, రాత్రా?"

"నాన్నా, మరి రాత్రిగాదూ చందమామ వచ్చేది"

"మరి పగలు ఎవరుంటారు?"

"పగలా నాన్నా, సూర్యుడు."

"సరే. మరి ఇద్దర్లోకి ఎవరికెక్కువ వెలుగుంది?"

"నాన్నా, నాన్నా చంద్రుడిలోకి వెలుగేలాగ వచ్చింది."

"సూర్యుడిలో కెలాగవచ్చిందో మొదట చెప్పు."

"నాన్నా, చంద్రుడిలో సూర్యుడు దీపంపెట్టాడా?"

"అవునుగానీ మనకు రాత్రి చంద్రుడు పగలు సూర్యుడు ప్రత్యక్ష దైవాలు."

"అంటే యేమిటి నాన్నా"

"అంటే దేవుళ్లన్నమాట"

"మనం దండంబెట్టాలా నాన్నా!"

'అం. వీళ్లద్దరూకాక ఎప్పుడూ మన కగుపించే దేవుళ్లెవరు?'

"దీపం, గౌరీదేవి"

"అదిగాదురా, ఎప్పుడూ నీతో తిరిగేవాళ్లు."

"నువు చెప్పవునాన్నా!"

"ఆలోచించి నువు చెప్పుకోవాలి."

"కొంచెం చెప్పు నాన్నా!"

"మీ అ...."

"ఇంకా కొంచెం చెప్పు నాన్నా"

"మీ అమ్మ వొకటిరా."

"మా అమ్మ ఏఁవిటే నాన్నా"

"మీ అమ్మ వొకదేవుడు."

"అమ్మ దేవుడా నాన్నా?"

"ఆఁ. నాన్న ఒకదేవుడు."

"నువ్వూ దేవుడవే నాన్నా!"

"ఆఁ. మాతృదేవోభవ, పితృదేవోభవ, అచార్య దేవోభవ, అతిథిదేవోభవ, అన్నమాట జ్ఞాపకం వుంచుకో."

"మరి నాన్నా మీగిద్దరూ దేవుళ్లయితే మరీ...."

"నేను చెప్పేది కొసాకే విను. తొమ్మిది మాసములూ మోసి కనీ పెంచీ, నిన్ను పెద్దవాణ్ణిచేసిన మీఅమ్మ దేవుడు కాదటరా? ప్రజయాపితృభ్యః అనేవాక్యం వినలేదూ?"

"మీరిద్దరూ దేవుళ్లయితే మరీ........"

"ఛట్ వుండు. మీఅమ్మని ఎప్పుడూ పూజిస్తూవుండు. తెల్లవార గట్టేలేచి, లేచీలేవడంతోనే, మీ అమ్మముఖం జూసి మీఅమ్మకు దండం బెట్టినట్లయితే భూప్రదక్షిణం చేసినంత పుణ్యం?"

"మరి నీకు దండంపెట్టొద్దూ నాన్నా!"

"నాసంగతి చెపుతాను. ముందుగా వినూ. మీఅమ్మ మాటకెప్పుడూ ఎదురాడగూడదు. చెప్పినట్టల్లా చేస్తూం డాలి."

"మరి నాన్నా! అమ్మ అస్తమానవున్నా కుంకుడుకాయలు గొట్టమంటుంది. నీళ్ళపొయిలో కర్ర లెగసన తొయ్యమంటూంది. కాళ్లు కడుక్కోటానికి నీకస్తమానం చెంబుతో నీళ్లు అందివ్వమంటుంది. తమ్ముణ్ణి ఆడించమంటుంది. అన్నంలో మావిడిపండు వెయ్యకుండా ఆవకాయ వేసుకోని తినమంటూంది మరి"

"ఓహోహూ, మీఅమ్మ యేంచెప్పితే అది చెయ్యవలసిందే. మీఅమ్మ వొకదేవుడు. నేనొకదేవుణ్ణి తెలిసిందా?"

"నాన్నా మరి, మీరిద్దరూ దేవుళ్ళయితే; మరి నేనో...."

"నువ్వా? నువ్వు భక్తుడివి."

"కాదు నాన్నా! మీరిద్దరూ పెద్దదేవుళ్ళూ నేనో చిన్నదేవుణ్ణి. కాదూ నాన్నా!"

ప్రపంచకంలో ఆశ లేందే యెవడూ బతకలేడు. నానీతిబోధకు ప్రతిఫలం వుండకపోతుందా అనే ధైర్యమే నన్ను నిలబెడుతూంది.